
అన్నదాతకు 'అకాల' కష్టం 2


2 నర్సరీ పరిశీలించిన ఏపీడీ


విద్యుత్ అంతరాయం 2



www.aksharatoday.com
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND








6-5-2025 (TUESDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2


ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు త్వరలో మోక్షం లభించనుంది. ఈ పనుల కోసం తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి



# ప్యాకేజీ 22 పనులకు మోక్షం!

- ఎట్టకేలకు నిధులు మంజూరు
- రైతుల పరిహారం కోసం రూ.23.15 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- త్వరలో రూ.200 కోట్ల విడుదలయ్యే అవకాశం
- పనులు పూర్తయితే రెండు లక్షల ఎకరాలకు సాగునీరు

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం కాళేశ్వరం ప్యాకేజీ 22 పనులు చేపట్టింది. గత మూడేళ్లుగా ఎలాంటి నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా ప్రభుత్వం ఈ ప్యాకేజీ పనుల కోసం రూ.23.15 కోట్లు మంజూరు చేసింది. కాలువల కోసం భూమి సేకరించిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు ఈ నిధులు మంజూరు చేశారు.

### మరో 3 వేల ఎకరాలు అవసరం

కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, 22 పనులు కోసం మరో మూడు వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ప్యాకేజీ 22 కోసం ఇప్పటికే 619 మంది రైతుల నుంచి 316 ఎకరాలు సేకరించారు. తాజాగా రూ.23.15 కోట్లు విడుదల కాగా.. అధికారులు వాటిని రైతులకు అందించనున్నారు. మరో మూడు వేల ఎకరాల కోసం రూ.150 కోట్లు అవసరం ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు. మిగతా పనుల కోసం రూ.200 కోట్లు విడుదల చేస్తే పనులు పూర్తవుతాయి.

### 80 శాతం కాలువలు పూర్తి

కాళేశ్వరం 20, 21, 22 పనుల్లో భాగంగా ఇప్పటికే కాలువల నిర్మాణం దాదాపు పూర్తయింది. మోపాల్ మండలం కొండం చెరువు నుంచి 1.9 కిలోమీటర్ల అప్రోచ్ కెనాల్ ద్వారా యాచారం సొరంగంలోకి నీళ్లు రావాల్సి ఉంది. ఇక్కడి నుంచి 133 మీటర్ల ఎత్తులో 7.67 కిలోమీటర్ల పొడవైన లింక్ కెనాల్ ద్వారా భూంపల్లి రిజర్వాయర్, అక్కడి నుంచి లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్, రిడ్జి కెనాల్ ద్వారా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల రైతులకు నీరు అందించాల్సి ఉంది.

### రైతుల హర్షం

భూముల పరిహారం కోసం రూ.23 కోట్లు మంజూరు చేయడంతో త్వరలో పనులు ప్రారంభం అవుతాయని రైతులు భావిస్తున్నారు. కాగా ఈ ప్యాకేజీ పనులు పూర్తయితే కామారెడ్డి నియోజకవర్గంలో 80 వేల ఎకరాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు, బాన్సువాడ నియోజకవర్గంలో 12 వేల ఎకరాలు, రామాయంపేట మండలంలో 15 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది.



## హీరోయిన్ నేహాశెట్టి సందడి

ఆర్మూర్‌లో ప్రముఖ హీరోయిన్ నేహాశెట్టి(డీజే టిల్లు ఫేం) సందడి చేసింది. మంగళవారం పట్టణంలోని ఎల్‌వీఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన నేహా శెట్టి.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డితో కలిసి మాల్ ప్రారంభించారు.

- అక్షరటుడే, ఆర్మూర్

## కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాక్లూర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. హమాలీల కొరతను వెంటనే తీర్చాలని.. ధాన్యాన్ని వెనువెంటనే తూకాలు వేసి రైస్ మిల్లులకు పంపాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిరణ్, బీజేపీ నాయకులు రైతులు ఉన్నారు.

## 8న ఉద్యోగ మేళా

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని నిరుద్యోగులకు ఈ నెల 8న ఉద్యో గమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు తెలిపారు. అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్‌లో వివిధ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948748428, 99594 56793కు సంప్రదించాలని కోరారు.



## భూభారతి దరఖాస్తులను పకడ్బందీగా విచారించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భూభారతి దరఖా స్తులను పకడ్బందీగా విచారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. లింగంపేట మండలంలోని ముంబాజీపేటలో సర్వే నంబర్ 151, 302లో భూసమస్యపై మంగళవారం విచారణ చేపట్టారు. ప్రతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో నరేష్, నాయబ్ తహశీల్దార్ భరత్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామకృష్ణా గౌడ్ పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యత

**అక్షరటుడే, బోధన్:** పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవుల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లిలో మంగళవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

## ఏసీపీ నారాయణపై బదిలీ వేటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణపై బదిలీ వేటు పడింది. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా.. నిజామాబాద్ ట్రాఫిక్ విభాగం నూతన ఏసీపీగా సీటీసీలో ఉన్న మస్తాన్‌అలీకి బాధ్యతలు అప్పగించారు. ఏసీపీ నారాయణ బదిలీ అంశం నిజామాబాద్ కమిషనరేట్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. కాగా.. పలు ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

### ప్రక్షాళన అవసరం

నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోనే పనిచేస్తున్న మరో అధికారిపై సైతం ఆరోపణలున్నాయి. తనిఖీల వెనుక ఆయన అడ్డదారిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు బాధితుల ద్వారా తెలిసింది. కాగా.. ఈ విషయమై 'అక్షరటుడే' కథనాలు ప్రచురితం కాగా.. అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

## బాన్సువాడ ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేష్ చంద్ర మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. నేరాల నియంత్రణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రాత్రిపూట తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ అశోక్ ఉన్నారు.




బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

## కార్మిక చట్టాలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ అన్నారు. ఈ మేరకు బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు మంగళవారం మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బుజ్జిగారి సాయిలు, వెంకట్, శివ రాజులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్టాపూర్‌లో కంటి వైద్యశిబిరం



**అక్షరటుడే, ఆర్మూర్:** బాల్కొండ మండలం చిట్టాపూర్ జీపీలో 2013–14 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కంటివైద్య శిబిరం నిర్వహించారు. బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లింగం, బాల్కొండ మండలాధ్యక్షుడు జ్ఞానసాగర్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని సుల్తాన్ నగర్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను మండల ప్రత్యేకాధికారి ప్రమీల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుల్తాన్‌నగర్‌ను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం నిజాంసాగర్‌లోని నర్సరీని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శివ కుమార్, టీఏ చందు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఉన్నారు.



అకాల వర్షాలు అన్నదాతలను హడలెత్తిస్తున్నాయి. నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా మార్కెట్ యార్డులో ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.
- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# అన్నదాతకు 'అకాల' కష్టం

▪ భారీ వర్షంతో తడిసిముద్దయిన ధాన్యం ▪ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల వేడుకోలు

జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సుమారు 1000 క్వింటాలకు పైగా ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్, నందిపేట్, నవీపేట్ మండలాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు 15 రోజుల క్రితమే ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తరలించారు. తగినన్ని లారీలు, హమాలీలు అందుబాటులో లేకపోవడం వల్లే ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు.



**తడిసిన ధాన్యాన్ని కూడా కొనాల్సిందే..**

నిజామాబాద్ మండలంలోని ముబారక్ నగర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ పది రోజుల క్రితం వడ్లను యార్డుకు తరలించగా అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అదే గ్రామానికి చెందిన రాజు అనే రైతుకు చెందిన 20 బస్తాలు, దుబ్బ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే రైతు 20 బస్తాలు, రాములుకు చెందిన 80 బస్తాలు వర్షానికి తడిసాయని వాపోయారు. తడిచిన ధాన్యాన్ని కూడా సకాలంలో మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## అక్రమ వలసదారులను తిరిగి వెనక్కి పంపాలి



**అక్షరటుడే, బోధన్:** దేశంలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను దేశం నుంచి పంపివేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ అధ్యక్షుడు గోపికిషన్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశీయులను వెనక్కి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, నాయకులు బాలరాజు, వినోద్, సందీప్, గౌతం, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మంగళవారం పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు లక్ష్మణ్, విజయ్ కుమార్, రాజగోపాల్, రమేశ్ పాల్గొన్నారు.

## కోట దుర్గామాత ఆలయంలో అన్నదానం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని కోటగల్లిలోని కోట దుర్గామాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరి లక్ష్మి, కాశీనాథ్ దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్‌లో నిర్మించిన బీరప్ప ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా పూజలు జరిపించారు. ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ బీరప్ప ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మందిరంలో నీటికోసం బోరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు శశాంక్‌ను కోరగా ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దొరబాబు, సున్నం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను వినియోగించుకోవాలి



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువజన, క్రీడల శాఖాధికారి జగన్నాథం సూచించారు. రామారెడ్డిలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10 ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామారెడ్డి ఇప్పటివరకు 34 మంది బాలబాలికలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ సంజయ్ కుమార్, తహశీల్దార్ ఉమాలత, ఎంపీడీవో తిరుపతిరెడ్డి కోచింగ్ ఇన్‌ఛార్జి బాలరాజు, తదితరులున్నారు.




## నర్సరీ పరిశీలించిన ఏపీడీ

మహమ్మద్ నగర్ మండలంలోని తెల్గాపూర్ నర్సరీని ఉపాధిహామీ ఏపీడీ వామన్‌రావు మంగళవారం పరిశీలించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం.ఐ ఈనెల 5న అక్షర టుడేలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన నర్సరీని సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్, ఏపీవో శివకుమార్, టీఏ బాల్‌సింగ్, అనిల్ కుమార్ ఉన్నారు. - అక్షరటుడే, నిజాంసాగర్

## నగరంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగర శివారులోని ముబారక్ నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ముబారక్ నగర్, మహాలక్ష్మి నగర్, ఆర్టీసీ కాలనీ, భాగ్యనగర్ కాలనీ , శ్రీనివాస్ నగర్, లక్ష్మీప్రియ నగర్, జనప్రియ నగర్, ఏకశిలా నగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు.

## షబ్బీర్ అలీ చిత్రపటానికి పాలాభిషేకం

**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** దోమకొండలో మంగళవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రాణహిత చేవెళ్ల పథకం పాత డిజైన్ ప్రకారమే చేపట్టేందుకు రూ.23 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, సిద్ధ రాములు, స్వామిగౌడ్, షమ్మీ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.